
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 2 మార్చి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు







జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

పోర్టు పనులు అడ్డుకున్న రైతులు
-హైవేలో నిలిచిన వాహనాలు

(వార్త మెయిన్ పేజీలో)

ప్రజలపై 'గ్యాస్' గుదిబండ..!

రూ.50 పెంచిన కేంద్రం - రూ.1165 పెరిగిన గృహ గ్యాస్

కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై మళ్లీ గ్యాస్ గుదిబండ వేసింది. ఒకప్పుడు గ్యాస్ ధర ఐదో, పది రూపాయలు పెరిగేవి. బిజెపి అధికారంలోకి వచ్చాక ఒక్కోసారి రూ.50, రూ.75, రూ.100 పెంచుకుంటూ పోతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కేవలం రూ.460 ఉంటే, ఇప్పుడు రూ.1165కి పెరిగింది. జిల్లా వ్యాపితంగా 8.60 లక్షలు గృహ వినియోగ గ్యాస్ కనెక్షన్లు, సుమారు 4,500 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం పెరిగిన ధరలతో ప్రతి నెలా గృహ వినియోగదారులపై రూ.4.30 కోట్లు భారం పడుతుండగా, ఏడాదికి అది రూ.51.60 కోట్లు అవుతోంది. అసలే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతోన్న ప్రజలకు ఇది మరింత భారంగా మారనుంది..




ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం ఆపడం లేదు. కరోనా సమయంలోనే గ్యాస్ ధరలు భారీగా పెంచారు. ఒకేసారి రూ.50 నుంచి రూ.100 పెంచిన పరిస్థితులున్నాయి. 2009 సమయంలో గ్యాస్ బండ ధర కేవలం రూ.460 ఉండేది. ఆరోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదో, పదో గ్యాస్ ధర పెంచితే బిజెపి నాయకులు గగ్గోలు పెడుతూ రోడ్లపైకొచ్చారు. ఇప్పుడు గ్యాస్ ధర ఒక్కసారిగా రూ.1165కి పెరిగింది. గతంలో రూ.1115 ఉండగా, తాజాగా రూ. 50 పెంచారు. ఇది సాధారణ, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా ఉన్నాయి. పెట్రోల్ రూ.112 ఉండగా, డీజిల్ రూ.98 పలుకుతోంది. ఇక నూనె, పప్పు, సబ్బులు సరేసరి. ఈ ధరలతో ప్రజల జీవన విధానం ముందుకు సాగడం లేదు. కరోనా సమయంలో దేశమంతా ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడే మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరలు భారీగా పెంచింది. ఇప్పుడు మరంత రెచ్చిపోతుంది. ప్రతిపక్షాల ఆందోళనలు పట్టించుకోకుండా ఇష్టానుసారం పెంచుతోంది. జిల్లా వ్యాపితంగా 8.60 లక్షల గృహ వినియోగ కనెక్షన్లు, 4,500 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పుడు పెరిగిన ధరలతో ఒక్కో వినియోగదారులపై రూ.50 భారం పడింది. ఇది ప్రతి నెలా రూ.4.30 కోట్లు పెరుగుతుండగా, ఏడాదికి రూ.51.60 కోట్లకు పెరుగుతోంది. పెరిగిన ధరలపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వం విధానాలపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలపై అధిక భారం

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలపై రూ.50లు పెంచడం సరైంది కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న సాధా రణ, మధ్య తరగతి ప్రజలకు మరింత భారంగా మారు తుం దన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరే కంగా సిపిఎం ఉద్యమి స్తుందని, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కలెక్టర్‌ను కలిసిన నూతన డివిఎంసి సభ్యులు శీనయ్య

'డివిఎంసి' వివాదం..!

-హైకోర్టును ఆశ్రయించిన సభ్యులు
-కలెక్టర్, ఎస్‌పిలకు నోటీసులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల తొలగింపు వివాదమైంది. ప్రస్తుత సభ్యులుగా ఉన్న కెసి పెంచలయ్య, రఘులను కలెక్టర్ తొలగించారు. ఎస్‌పి విజయరావు ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎవరో ఫిర్యాదు ఇచ్చారని, ఆ కారణంతో ఇద్దరు సభ్యులను తొలగించారని చెబుతున్నారు. అధికారులు తమపై కక్షతోనే ఇలా చేశారని సభ్యులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కెసి పెంచలయ్య, రఘు మంగళవారం హైకోర్టులో రిట్ వేశారు. దీనిపై బుధవారం కేసు వాదనలకు వచ్చింది. సంబంధిత అధికారులు కోర్టుకు హాజరైనట్లు తెలిసింది. అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో హైకోర్టు జడ్జి 3 వతేదికి కేసును వాయిదా వేశారు.కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్‌పి విజయరావు, సోషల్ వెల్ఫర్ డిడి, సోషల్ వెల్ఫర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్లు వ్యతిరేకతంగా హాజరై, సభ్యులను తొలగించడానికి ఉన్న ఆధారాలు చూపాలని జడ్జి ఎన్. జయసూర్య ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. బుధవారం నూతన డివిఎంసి సభ్యులుగా చౌటూరి శీనయ్యను కలెక్టర్ నియమించారు.

స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలన

నెల్లూరు : జిల్లాలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాట్లు నిబంధనలు మేరకు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు, అధికారులను ఆదేశించారు. జిల్లాలో 13వ తేదీన జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో బుధవారం కలెక్టర్, ఆర్‌డిఓ శ్రీ మాలోలతో కలసి డి.కె.డబ్ల్యూ. కళాశాలలో నెల్లూరు డివిజన్ కు సంబంధించి చేపట్టనున్న డిస్ట్రి బ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల , స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లును పరిశీలించారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు హనుమాన్ ప్రసాద్, రూరల్ తహశీల్దార్ సుబ్బయ్య ఉన్నారు.

ఆదర్శ మహిళా నేత 'జక్కా పార్వతమ్మ'

ఐద్వా ఆధ్వర్యంలో సంతాప సభ



పార్వతమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ ఆ ఛాయ లక్షణాలు ప్రదర్శించకుండా నిస్వార్థంగా నిరాడంబరమైన జీవన విధానం అవలంబించిన భర్త అడుగు జాడల్లో తుది వరకూ పయనించిన జక్కా పార్వతమ్మ ఆదర్శ మహిళ అని ఐద్వా నేతలు పేర్కొన్నారు. బుధవారం బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జక్కా పార్వతమ్మ సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి అధ్యక్షత వహించారు. తొలుత జక్కా పార్వతమ్మ చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకులు అరిగెల రమమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామీణ మహిళా జిల్లా కన్వీనర్ డి అన్నపూర్ణమ్మ, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి షేక్ రెహనా బేగం మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కోరికల విజయమ్మ పాల్గొని జక్కా పార్వతమ్మ జీవిత విశేషాలను వివరించారు. జక్కా పార్వతమ్మ భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ ఎక్కడా ఆమెలో ఆ ఛాయలు కనిపించవన్నారు. తన బిడ్డలపైనా భూస్వామ్య నీడలు పడకుండా చూసుకున్నారన్నారు. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత జక్కా వెంకయ్య చేసిన ఎన్నో భూ పోరాటాలు, కూలిపోరాటాలు అణగారిన సామాజిక వర్గాల వారి కోసం పనిచేస్తూ ఉంటే అండగా నిలిచిందన్నారు. నేటి మహిళాలందరూ కూడా జక్కాపార్వతమ్మను స్ఫూర్తిగా తీసుకొని మహిళా సమస్యలపై పోరాడాలని సూచించారు. మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, కె పద్మ ,ఎస్ వరలక్ష్మి, నాగమ్మ ప్రమీల, శంషాద్, జాకిర, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మెడికోవర్ 'నిర్లక్ష్యం'..!

రోగి మృతి - బంధువుల ఆందోళన



మీడియాతో మాట్లాతున్న మృతుని కుమారుడు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :మెడికోవర్ ఆస్పత్రి నిర్లక్ష్యం కారణంగా ఓ రోగి మృతి చెందారని బంధువులు ఆరోపించారు. తమకు ప్రమేయం లేకుండా ఆపరేషన్ చేసి, మృతికి కారణ మయ్యారంటూ బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మంగళ వారం రాత్రి జరిగింది. ఉదయగిరి ప్రాంతానికి చెందిన 65 సంవత్సరాల ఓ వ్యక్తి పదైదో రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పించారు. లంగ్స్ ఇబ్బంది ఉండడాన్ని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆయనకు ఇబ్బంది ఉంటే ఆపరేషన్ చేయొద్దని మందులు రాసిస్తే ఇంట్లో పెట్టుకుంటామని రోగి బంధువులు చెప్పారు. ఏం ఇబ్బంది లేదని ఆపరేషన్ చేస్తే బాగుంటారని తెలిపారు. ఇదే సమయంలో సీరియస్‌గా ఉందనిగాని, ఇబ్బందని చెప్పలేదని చెబుతున్నారు. మంగళ వారం ఉదయం ఆపరేషన్ చేయడానికి థియేటర్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో రోగి బాగున్నారని బంధువులు చెబుతున్నారు. సాయ ంత్రం ఆపరే షన్ చేస్తుండగా మృతి చెందారని వైద్యులు చె ప్ప డ ం తో బంధువులు ఆందోళనకు దిగారు. ఇబ్బంది ఉంటే తమకు చెప్పకుండా ఆపరేషన్ చేసి, మా నాన్నను చంపారని ఆయన కుమారుడు విమర్శించారు. మెడికోవర్ ఆసుపత్రి నిర్లక్ష్యం కారణంగానే మా నాన్న మృతికి కారణమని ఆందోళనకు దిగారు. ఏ విషయం చెప్పకుండా బిల్లుల కోసం ఆసుపత్రి యాజ మాన్యం వ్యవహరించిందని ఆరోపించారు. ఆస్పత్రి సిబ్బందితోనూ వాదనలకు దిగారు. కొద్ది సేపు ఆసుపత్రి వద్ద ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి.



మెడికోవర్ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

'కోటంరెడ్డి' టిడిపిలో చేరికకు సన్నాహాలు..!

అమరావతిలో చంద్రబాబు సమక్షంలోనే.. ముహూర్తం కోసం ఆలస్యం

నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల వైసిపి నుంచి బయటకొచ్చారు. ఆయనతోపాటు సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వచ్చారు. టిడిపిలో చేరుతారని ప్రచారం సాగుతోన్న విషయం తెలిసింది. టిడిపిలోకి కొందరు నేతలు వీరి చేరికను వ్యతిరేకిస్తున్నారు. ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి వల్ల ఇబ్బందులు పడ్డవారు సీరియస్‌గా ఉన్నారు. ఈ నేపథ్యంలో తొలుత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకోడానికి సన్నాహాలు సాగుతున్నాయి. ఈనెల 9 లేదా మరో తేదీన చంద్రబాబు సమక్షంలో అమరావతిలో చేరికకు రంగం సిద్ధమయ్యారు. ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి చేరిక మరికొంత

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి నుంచి బయటకు వచ్చిన కోటంరెడ్డి సోదరులు టిడిపిలో చేరేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బయటకొచ్చిన విషయం తెలిసిందే. టిడిపిలో చేరడానికి సోదరులు ఉత్సాహ పడుతున్నారు. వైసిపి అధిష్ఠానం వారిపై దాడి పెంచింది. త్వరగా టిడిపిలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ముందుగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. ఈనెల 9న అధికారికంగా అమరావతిలో చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మంచి ముహూర్తం కాకపోవడంతో మంచి రోజు కోసం చూస్తున్నారు. ఈనెల 9 లేదా 30 వతేది లోపు ఏ రోజు బాగుంటే ఆరోజు చేరడానికి సన్నాహాలు సాగుతున్నాయి. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై స్థానిక నేతలు కొంత ఆగ్రహంతో ఉన్నారు. తమ పై దాడులు, కేసులు, ఆర్థిక ఇబ్బందులు సృష్టించారని ఆయన వద్దంటూ కొందరు నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉండడంతో కొన్ని రోజుల తరువాత టిడిపిలో చేరడానికి సన్నాహాలు సాగుతున్నాయి. టిడిపి అధిష్టానం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. శ్రీధర్‌రెడ్డి ఇప్పటికే చంద్రబాబునాయుడు, లోకేష్‌తో మాట్లాడి నట్లు సమాచారం. జిల్లా నేతలు, స్థానిక రూరల్ నేతలతో చంద్రబాబు స్వయంగా మాట్లాడి వివాదాలు సర్దుమణిగిన తరువాత పార్టీలోకి ఆహ్వానించాలని ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత సమయంలో పార్టీలో ఎవరు వచ్చినా చేర్చుకోడానికి టిడిపి అధిష్ఠానం చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షంలోని సమయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నేతలకు భరోసా కల్పించిన తరువాతే పార్టీకి శ్రీధర్‌రెడ్డిని ఆహ్వానించనున్నారు. తొలుత గిరిధర్‌రెడ్డికి అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలిసింది. తమ అనుచరులు, అభి మానులతో కలిసి పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నారు.



కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

శోకసంద్రంలోనే తోడేరు..

ప్రజాశక్తి - పొదలకూరు : మండలంలోని తోడేరు విషాదంలోనే ఉంది. ఆదివారం పడవ బోల్తా పడి ఆరుగు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన జరిగి మూడు రోజులు గడిచినా ఆ గ్రామాన్ని విషాదం వీడలేదు. తోడేరు గ్రామం. మంత్రి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్వగ్రామం. ఆయన ప్రత్యేక చొరవతో గ్రామం ఎంతగానో అభివద్ధి చెందింది. గ్రామంలో అన్ని కనీస వసతులు కల్పించారు. గ్రామస్తులందరూ ఐక్యంగా ఉంటారు. ఇటువంటి నేపథ్యంలో ఆ గ్రామంలో పెద్ద ఘోరం జరిగిపో యింది. దీంతో గ్రామం మొత్తం విషాదం నుంచి తేరుకోలేదు. మృతిచెందిన ఆరుగురు 30 ఏళ్లలోపు వారే. అంతేగాక ఆయా కుటుం బాల్లో మగసంతానంగా వారే ఉండటం గమనార్హం. గ్రామస్తులు విషాదం నుంచి తేరుకునేందుకు మరి కొంత సమయం పట్టనుంది. మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే ఘోర సంఘటనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు.

సైనిక స్కూల్ ప్రవేశ ఫలితాల్లో
నేతాజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు : సైనిక్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో శ్రీ నేతాజీ పైలట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశం కోసం జనవరి 8వ తేదీన జరిగిన పరీక్షల్లో మా కోచింగ్ సెంటర్ నుంచి 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజర య్యారని వారిలో 28 మంది విద్యార్థులు అర్హత సాధించాలని సంతోషిస్తున్నామని నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. వారిలో మొదటి స్థానం టి.రేవంత్ రెండో స్థానం ఎం.శాన్వి ప్రియ, మూడవ స్థానం ఎం.తులసీనాథ్ రెడ్డి సాధించారు. ఈ విజయానికి సహకరించిన విద్యార్థులను తల్లిదండ్రులను ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ విద్యారత్నం నేతాజీ సుబ్బారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గత 30 ఏళ్ల నుంచి నవోదయ సైనిక పాఠశాలలు ప్రవేశ పరీక్షలు ప్రత్యేక కోచింగ్ ఇవ్వడం జరుగు తుందని అన్నిట్లోనూ మా విద్యార్థులు ప్రత్యేక ప్రతిభను చూపించి ఎక్కువగా సీట్లు కైవసం చేసుకున్నారని శ్రీ నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. నేతాజీ సుబ్బారెడ్డి డైరెక్టర్లు కె. డాక్టర్, అలేఖ్య రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ సుభాషిని, సైనిక్ స్కూల్ కోచింగ్ ఇన్‌ఛార్జిలు బి.హేమలత, సుశీల, శ్యామల, ఆర్.చెంచయ్య పాల్గొన్నారు.



ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక బజారులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతనంగా బుధవారం ప్రతిష్ఠించిన శివలింగాన్ని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలయ్య స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక అంకమ్మ తల్లి ఆలయ పునర్ని ర్మాణం భక్తులు తనకు తోచిన విరాళాలు విరివిగా అందజేస్తున్నారు. బుధవారం సవిడి బోయిన శ్రీనివాసులు భార్య విజయలక్ష్మి కుమార్తె వసుంధర అల్లుడు జయంత్ రూ.25,116, సవిడిబోయిన తిరుపతయ్య భార్య ధనమ్మ కుమారులు వెంకట్రావు, వెంకటకష్ణ రూ.25116లు, చీదెళ్ల సింగయ్య చిన్న వెంకమ్మ జ్ఞాపకార్థం తిరు పతయ్య (బుజ్జి) భార్య ప్రసన్నకుమారి, అమత వర్షిని, దత్త శ్రీనాథ్ రూ.25116 పైడిపాటి శ్రీనివాసరావు భార్య నాగమణి రూ. 1116లు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. పిడికిడి వెంకటేశ్వర్లు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎని మిరెడ్డి వెంకటరెడ్డి, సూరం వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి..!



పొదలకూరులో..

ప్రజాశక్తి-నెల్లూరు

నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే ఉద్యమ నాయకులుగా పోటీలో నిలిచిన పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నగరంలోని పలు డివిజన్లలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుధవారం రూరల్ 21వ డివిజన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. నాయకులు పోతురాజు శ్రీనివాస్ మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యా యులు ,పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడే ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎంఎల్‌ఎసి ఎన్నికల్లో పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలిపించాలని కోరారు. సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు డబ్బుగుంట శ్రీనివాసులు, ముని, అయోధ్య, జనార్ధన్, మురళి పాల్గొన్నారు. మండలంలోని శంకరనగరం, లక్కరాజుపల్లి, రేవూరు, మినగల్లు, కొత్తపల్లి, వడ్డిపాళెం గ్రామాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగల పుల్లయ్య, జెవివి నేతలు వేము పెంచలయ్య, యుటిఎఫ్ మండల ఎ.వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు ఎంఎల్‌సి ఎన్నికల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఎస్‌డి వల్లి అహ్మద్, సిఐటియు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్‌బాషా, యుటిఎఫ్ నాయకులు వేణు పాల్గొన్నారు. 26వ డివిజన్ పరిధిలోని ఉడ్ కాంప్లెక్స్‌లో తోపుడు మిల్లుల అసోసియేషన్ ఏర్పడి ఏడాది పూర్తియిన సందర్భంగా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య ,రూరల్ సిఐటియు కార్యదర్శి కిన్నెర కుమార్ ,రూరల్ కమిటి సభ్యులు దేవతాటి సంపత్ కుమార్ ,శాఖ కార్యదర్శి కాలేషా,తోపుడు మిల్లు అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శిలు ఇర్ఫాన్ ,వెంకటేశ్వర్లు , కమిటి సభ్యులు పాల్గొని సమిష్టిగా పిలుపు ఇచ్చారు. 27. డివిజన్ చంద్రమౌళి నగర్ లో ఈరోజు సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ అధ్యక్షులు ఎస్కే ఖలీల్. సిఐటియు కార్యకర్తలు కొండారెడ్డి శ్రీనివాసులు కరపత్రాలు పంపిణీ చేశారు.

పొదలకూరు : ఈనెల 13వ తేదీన జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు కోరారు. పొదల కూరులో బుధవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక యుటిఎఫ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై చూపుతున్న సవతి ప్రేమను వారంతా గమనిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిరంతరం పోరాడే ఉపాధ్యాయ ఉద్యమ అభ్యర్థులను మీరు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకులు మాదాల వెంకటకష్ణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం వెంకటేశ్వర రెడ్డిలను గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి బాబు రాష్ట్ర కౌన్సిలర్ బి. వెంకటేశ్వర్లు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇతర సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నెల్లూరులో ప్రచారం చేస్తున్న నాయకులు



నెల్లూరులో...

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు :ఉడ్‌హౌస్ సంఘంలో జరిగిన హత్య కేసుకు సంబంధించి ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో అందరూ నేర చరిత్ర కలిగిన వారేని నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగర డిఎస్‌పి త ఛాంబర్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల 14న ఉడ్‌హౌస్ సంఘం ప్రాంతంలో బిరదవోలు మహేష్ హత్యకు గురయ్యాడు. తండ్రి దయాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా అరవభూమి సుజన్ కృష్ణ అలియాస్ చింటును గుర్తించారు. మృతుడు పెయింటర్ అని, ఇటీవల ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో చిన్న పాటి వివాదం ఈ హత్యకు కారణమైందని తేలింది. చింటుకూ స్నేహితులైన కోకుల భాను విష్ణువర్ధన్, పాల సాయి జగదీష్, మించాల స్రవంత్, షేక్ రెహిమాన్, అర్కుట్ వెంకటేష్, చల్లా రవీంద్ర వ్యూహరచ చేసి ఈ హత్యకు పాల్పడినట్లు తేలింది. నిందితులపై గతంలో చిన్నబజార్, వేదాయపాళెం, బాలాజీనగర్ ప్రాంతాల పోలీసు స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడి చింటుపై ఇప్పటికే రౌడీషీట్ ఓపెన్ చేసి ఉన్నట్లు గుర్తించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. త్వరలో అరెస్టు చేస్తామని డిఎస్‌పి వెల్లడించారు. నవాబుపేట సిఐ టి.వి.సుబ్బారావు పాల్గొన్నారు.



నకిలీ మద్యం కేసులో..

గోవా రాష్ట్రానికి చెందిన నకిలీ మద్యం విక్రయం, అమ్మకాలుకు సంబంధించి గత ఏడాది ఎస్ఇబి పోలీసు స్టేషన్ -1 పరిధిలో నమోదైన కేసులకు సంబంధించిన మైఖెల్ అనే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం ఎస్ఈబి పోలీసు స్టేషన్-1 ఆవరణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు ఇన్స్పెక్టర్ కె.పి కిషోర్ వివరాలు వెల్లడించారు. గత ఏడాది నమోదైన కేసు విచారణలో భాగంగా ఎస్‌పి సిహెచ్ విజయరావు, ఎస్ఈబి డిఎస్ఈఒ కె.శ్రీలక్ష్మి, ఎస్ఇబి సూపరింటెండెంట్ ఎస్. కృష్ణకిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారెంట్‌పై గోవాలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం 14 మంది నిందితులున్నప్పటికీ ఇప్పటికే 13 మందిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరిచామన్నారు.

'ఉసురుపాటి' పరామర్శ

ప్రజాశక్తి -కందుకూరు : ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ వీరాభిమాని కసుకుర్తి నవరత్నం కుమార్తె నిఖిత అనారోగ్యం కారణంగా స్థానిక ప్రణవి చిన్నపిల్లల హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న బ్రహ్మయ్య మాదిగ బుధవారం కందుకూరుకు వచ్చారు. నిఖితను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లతో మాట్లాడారు. నిఖిత త్వరగా కోలుకోవాలనిఆయన ఆకాంక్షించారు. రావినూతల కోటి, రేణమాల మాధవ్, అత్యాల శరత్, రేణమాల మహేష్, గౌడపేరు ప్రసాదు, గౌడపేరు అనిల్, ఎండ్లూరి చిన్న, గౌడపేరు మరియ దాస్, జడ భాస్కర్, తాటిపర్తి రమేష్, గోచిపాతల విజయ్ కుమార్

ఎంఎల్‌సి అభ్యర్థి విజయం కోరుతూ ప్రచారం

ప్రజాశక్తి -ఉలవపాడు


మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి నాయకులు బుధవారం విస్తృతంగా ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఉలవపాడు, కరేడు, భీమవరం, బద్దిపూడి, కష్ణాపురం పంచాయతీల్లో పట్టబద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ కి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.క్లస్టర్ ఇంచార్జ్ లు సుదర్శి శ్రీనివాసులు, పోలుబోయిన శ్రీనివాసులు, గ్రామ పార్టీల అధ్యక్షులు అంచుపోగు వాసు, కన్నా ప్రసాద్, యూనిట్ ఇంచార్జ్ గణపతి రాజు చలపతిరావు ఉన్నారు.

అధికారులకు హైకోర్టు అక్షింతలు..?

ప్రజాశక్తి- తోటపల్లిగూడూరు :రొయ్యల చెరువుల ధ్వంసం కేసు అటవీ శాఖ మెడకు చుట్టుకొంటోంది. ఆ శాఖ అధికారులు ప్రదర్శించిన అత్యుత్సాహంపై హైకోర్టు న్యాయమూర్తి అక్షింతలు వేసినట్లు సమాచారం. మండలంలోని కోడూరు పంచాయతీ వెంకటేశ్వం పట్టపు పాళెం పరిధిలో గ్రామకంఠం భూముల్లో స్థానిక టిడిపి నాయకులు వీరబోయిన గంగాధర్ యాదవ్ మూడున్నరేళ్ల కిందట మత్స్యకారపాళేనికి చెందిన 16.5 ఎకరాల విస్తీర్ణంలోని గ్రామ కంఠం భూములను మత్స్య కారుల నుంచి లీజుకు తీసుకున్నారు. అందులో రొయ్యల సాగు చేపట్టారు. టిడిపి బిసి నాయకుడు గంగాధర్ యాదవ్ మత్స్యకారుల నుంచి లీజుకు తీసుకుని సాగు చేసుకుంటున్న గ్రామ కంఠం భూముల విషయంలో అటవీ శాఖ అధికారులు అధికార పార్టీ నాయకులకు వంతపాడారు. దీంతో అటవీ శాఖ భూములుగా తప్పుదోవ పట్టి రొయ్యల గుంతలను ధ్వంసం చేయడం జరిగింది. ఈ ఘటన లో సాగు చేసిన దాదాపు రూ.కోటికి పై గా నష్టం వాటిల్లింది. కోర్టు స్టే అమలులో ఉండగానే, పోలీసు బలగాలతో గుంతలను అటవీ శాఖ అధికారులు కోర్టు ఆదేశాలను ధిక్కరించి ధ్వంసం చేయడం గమనార్హం. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించారు.మూడున్నరేళ్ల విచారణ అనంతరం సాగు చేపట్టిన భూములు అటవీ శాఖ భూములు కాదని, అవి గ్రామ కంఠంకు సంబంధించినవని నిర్ధారణ అయినట్లు విశ్వ సనీయ సమాచారం. ఈ మేర కే ఇటీవలే హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచారు. అధికారులకు అక్షింతలు వేసినట్లు తెలిసింది. దీంతో అధికారులు రెవెన్యూ రికార్డులను తారు మారు చేసే దుస్సాహసానికి ఒడికట్టడమే కాకుండా నాడు ధ్వంసం చేసింది. 16.5 ఎకరా ల్లోని రొయ్యల గుంతలు కాద ని, కేవలం నాలుగు ఎకరాల్లో మాత్రమే అని చెప్పాలంటూ అటు మత్స్యకారులు, ఇటు స్థానిక అధికారులపై ఒత్తిళ్లు తీసుకు రావడం సంచలనంగా మారింది. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన మత్స్యకారు లపై అక్రమ కేసులతో అధికారులు బెదిరింపులకు దిగడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

త్వరలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సైదాపురం : మండలకేంద్రమైన సైదాపురంలో నాడు -నేడు నిధులతో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం ప్రారంభ ానికి ముస్తాబు అవుతుంది. ఈ ప్రాంత ప్రజల అవసరాల కోసం ఆరోగ్య కేంద్ర శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి రూ. 1.55కోట్లు మంజూరు చేసింది. భవనం పూర్తి కావడంతో ప్రహరీ నిర్మాణానికి మరో రూ.34లక్షలు మంజూరు చేసినట్లు ఎంఎల్ఎ ప్రకటించారు. ప్రభుత్వం పూర్తయిన భవనాన్ని వినియోగంలోకి తీసుకొని రావాలని కోరారు.



రైతులకు సూచనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : వ్యవసాయంలో నష్టపోయిన రైతులు నష్టపరిహారం పొందేందుకు పంటకోత ప్రయోగాలు కీలకమని మండల వ్యవసాయాధికారి యు. గీతాకుమారి స్పష్టం చేశారు. బుధవారం తోటపల్లిగూడూరు మండలములోని కోడూరు బిట్-2 లో కొండూరు పాపమ్మ వరి పొలములో పంటకోత ప్రయోగము నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె. శశి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని గీతా కుమారి గారి పర్యవేక్షించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ



ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై బుధవారం అధికారులు సామాజిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో రూ.8 కోట్లతో నిర్వహించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 15వ విడత తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్ శాఖ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఆయా శాఖలకు సంబంధించిన రికార్డులు పరిశీలించామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోగులకు వీల్‌ఛైర్ అందజేత



ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వీల్‌ఛైర్ ఉపయోగపడాలనే ఉద్దేశంతో డాక్టర్ ల్యాబ్ అధినేత రాజేష్ దంపతులు తన అత్త ఎమ్.డి.తహసీన్ జ్ఞాపకార్థంగా వీల్‌ఛైర్ అందజేశారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో తన అత్త తహసీన్ జ్ఞాపకార్థంగా ఆరోగ్య కేంద్రకు వచ్చే రోగులకు ఉపయోగకరంగా ఉండేందుకు వీల్‌ఛైర్‌ను వైద్యుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం వైద్యులు డిడిఒ శీలావతి, అనస్తీషియా డాక్టర్ అనీఫ్, రూస్సీ, అనిస్‌సల్మా, శంషుద్దీన్, ఫిజియోథెరపీ కుమారి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవం



ప్రజాశక్తి-కావలి : మార్చి 1వ తేదీన ఎస్సీ వర్గీకరణ ఉద్యమ సాధన పోరులో తమ ప్రాణాలను సైతం అర్పించిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం కావలి టౌన్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఆ.ఎ.ఫ్. నాయకులు మంద వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీనిచ్చి, నేటికీ 9 సంవత్సరాలు పూర్తవుతున్నా వర్గీకరణ ఊసే ఎత్తకుండా మోడీ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తూ వస్తుందని విమర్శించారు. ఇకనైనా బిజెపి మాదిగలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకుని వాళ్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రేపు జరగబోయే ఎన్నికల్లో బిజెపి నాయకులను తెలుగురాష్ట్రాల్లో ఉండబడే మాదిగ పల్లెలోకి రానివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పేములు సీతారామయ్య, గౌరా జానకిరామ్, ఆళ్ళగంటలు యడవల్లి యేసురత్నం, చేవూరు కిరణ్‌కుమార్, కత్తి శివయ్య, కే.రామ్మోహన్, జోయిన మనోహర్, నిమ్మకాయల ప్రకాశం, పేములప్రకాశ్, పొట్టూరి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కలిగిరి : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మహాజన నేత మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సి వర్గీకరణ పోరాటంలో అమరవీరులకు బుధవారం ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ఎఫ్ కమిటీల ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జ్ నందిపోగు వెంగలరావు మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి సీనియర్ నాయకులు బట్ట వెంకటేశ్వర్లు మాదిగ పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా జరుగుతున్న ఎస్సి వర్గీకరణ పోరాటంలో ఎంతోమంది మాదిగ యువకులు అమరులయ్యారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతే కాకుండా తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నే ఎస్సి వర్గీకరణ చట్టబద్ధత కల్పిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరచిన బిజెపి అధికారంలోకి వచ్చి 9సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోకుండా మాదిగలను మోసం చేసిందన్నారు. మార్చిలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఎస్సి వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు బొర్రా వెంగయ్య మాదిగ, జక్కా కృష్ణమూర్తి, పోలిపోగు కొండయ్య మాదిగ, కర్రా సామియేలు మాదిగ, తుమ్మూరు సుధీర్‌కుమార్ మాదిగ, నందిపోగు మల్లికార్జున మాదిగ, మొద్దు మస్తాన్‌మాదిగ, పందల శ్రీనివాసులు మాదిగ, కర్రా రాజమాదిగ, కొంజేటి శివకుమార్‌మాదిగ పాల్గొన్నారు.

ప్రమాద స్థలంలో డిఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మండలంలోని యగ్నస్ సెంటర్ వద్ద జీవీవల వద్ద లారీ బోల్తా పడిన సంగతి అందరికీ అయితే బుధవారం ప్రమాదం జరిగిన కల్వర్టును రూరల్ డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి పరిశీలించారు. స్థానిక ఎస్ఐ సిహెచ్ వాసును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో ముందస్తు జాగ్రత్తగా డేంజర్ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన దగ్గర అన్ని డిపార్ట్మెంట్స్‌తో కలిసి ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆయనవెంట ఆర్ అండ్ బి అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం







ప్రజాశక్తి-అనంతసాగరం : పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు రెడ్డిని, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బాబు రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బుధవారం మండలంలోని శంకరనగరం, లక్కరాజుపల్లి, రేవూరు, మినగల్లు, కొత్తపల్లి వడ్డిపాలెం గ్రామాలలో ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాసన మండలిలో నిరుద్యోగ, చిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వెట్టి చాకిరి విధానం రద్దు కోసం, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగాల కోసం, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరణ చేయాలని పోరాటం చేసే ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గ ఉద్యమాలకు అండగా నిలుస్తున్న పిడిఎఫ్ తరుపున గెలిచిన వారని పేర్కొన్నారు. ఓటు కలిగిన పట్టభద్రులు ప్రతిఒక్కరూ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, జెవివి నాయకులు వేము పెంచలయ్య, యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు రెడ్డి, నాయకులు ఎంఎల్‌సి ఎన్నికల కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ ఎస్‌డి.వల్లిఅహ్మద్, సిఐటియు మండల కార్యద్శి అన్వర్‌బాషా, యూటీఫ్ నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని వైకుంఠపురం 38వ వార్డు చేవూరు వారి తోట, తదితర ప్రాంతాలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని మంగళవారం డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్దల సభలో ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగుల తరపున ప్రశ్నించే అభ్యర్థి పిడిఎఫ్ తరపున పట్టభద్రుల నియోజక వర్గం నుండి పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి, ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, బోగిశెట్టి కిష్టయ్య, జి మధుసూదన్ రావు, వి.బాబురావు, సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, డివైఎఫ్ఐ నాయకులు పసుపులేటి పెంచల నరసింహం, గోచిపాతల ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, పలు వీధులో ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలన ఉపాధ్యాయుల గుర్తింపును కొనసాగించాలంటే ఉద్యోగ సంఘాల సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ పిడిఎఫ్ ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిలను మొదటి ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళ సంఘ నాయకురాలు, ఎంపిటిసి కాకు విజయ, నాయబ్, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : తూర్పు రాయలసీమ (చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం) శాసన మండలి ఎన్నికలలో పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిల గెలుపు కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రయివేటు కళాశాలలు, ఉన్నత పాఠశాలలో మండల రైతు సంఘం, సిఐటియు, యుటిఎఫ్, ఆవాజ్ తదితర ప్రజా సంఘాల నాయకులు లక్కు కృష్ణ ప్రసాద్, శివ ప్రసాద్, గంగాధర్, పఠాన్ యజ్దాని భాషా, హరికష్ణ, కొండమూరి హజరత్తయ్య, రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు సుధాకర్ రావు, షేక్ సందాని, వాగాల శ్రీహరి, మోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు.

జక్కా పార్వతమ్మకు సంతాపం

ప్రజాశక్తి-జలదంకి

స్థానిక సురే చెంచురెడ్డి భవనంలో గడ్డం మాల్యాద్రి అధ్యక్షతన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్‌ఎ, సిపిఎం సీనియర్ నేత జక్కా వెంకయ్య సతీమణి జక్కా పార్వతమ్మ మృతికి తొలుత సంతాపం వ్యక్తం చేసి జోహార్లు అర్పించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ జక్కా పార్వతమ్మ సిపిఎం పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. 13వ తేదీన జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర రెడ్డిని, పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతుల ధాన్యం గిట్టుబాటు రేటు ప్రభుత్వం నిర్ణయించిన రూ.17500 కొనుగోలు చేయడం లేదని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని, అందువల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మద్దతు రేటు సాధించుకునే దానికి రైతులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు అడపాల సురేష్, రైతు సంఘం నాయకులు రావి మాధవరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బత్తల నరసింహ, మహిళా సంఘం తరపున మారు బోయిన కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాళ్లూరి మాల్యాద్రి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-అల్లూరు

తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కార మార్గం చూపుతానని కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం మండల కేంద్రంలోని నగర పంచాయతీ కార్యాలయంలో పలు సమస్యలపై ఆయన దృష్టి సారించారు. పలువురు ప్రజలు గత 10 రోజుల నుండి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే 18 అంకణాల ఇళ్ల స్థలం కారణంగా పింఛన్లు తీసివేశారని అల్లూరు నగర పంచాయతీని రద్దు చేసి పంచాయతీలుగా కొనసాగించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.73 కోట్లతో తాగునీటి సమస్య తీరుస్తానని హామీనిచ్చారు. బడ్జెట్ సమావేశాలలో నగర పంచాయతీ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లి రద్దు చేసే బాధ్యత నాది అంటూ భరోసానిచ్చారు. ప్రతి రైతు ఈ-కెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని తద్వారా ఎంతో ఉపయోగకరమని వివరించారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతినెలా తహశీల్దార్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయాలకు వచ్చి తానే స్వయంగా సమస్యల పరిష్కరిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, కోడూరు సాధక్‌కుమార్ రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి

రైతన్నకు అండగా 'కాకర్ల ట్రస్ట్'

ప్రజాశక్తి-ఉదయగిరి



వ్యవసాయానికి వెన్నుముకలు రైతన్నకు అండగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ బుధవారం ఆర్లపడియ గ్రామంలో ముట్టుకుందు చిన్నప్పరెడ్డికి ఆర్థికసాయం చేశారు. సాగు చేస్తున్న వరిపంట అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన విషయం ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ దృష్టికి గ్రామస్తులు తీసుకురాగా ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించి ముట్టుకుందు చిన్నప్పరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి రూ.25వేలు తక్షణ ఆర్థికసాయంతో పాటు పవర్‌స్ప్రే అందించారు. అనంతరం యాక్సిడెంట్లో కాళ్లు ఫ్యాక్చర్ అయిన రైతు ఇర్ల రమణయ్యకి రూ.10వేలు తక్షణ సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్, ముట్టుకుందు తిరుపతి రెడ్డి, వాడకప్పు మాల్యాద్రి మాజీ సర్పంచ్, కిరణ్, మన్నెం మధురెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కలిగిరి : ఫిబ్రవరి 8న ట్రస్ట్ ప్రారంభోత్సవం నాడు నిరుపేద రైతులు పనిముట్లు కోసం నమోదు చేసుకొన్న వారికి పనిముట్లు ఉచితంగా ఇచ్చే కార్యక్రమంలో భాగంగా కలిగిరి మండలం నాగసముద్రం గ్రామ రైతు భరోసా కేంద్రానికి ఒక నూతన పవర్ స్ప్రేయర్ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించారు. అనంతరం ఆక్సిడెంట్‌లో కాలు పోగొట్టుకొని జీవిస్తున్న దేగా రాఘవేంద్ర రావుకు రూ.10 వేల తక్షణ సాయం అందించారు. కార్యక్రమంలో వెలుగోటి మధు, గ్రామ సర్పంచ్ డమ్ము శ్రీనివాస్, ఉప సర్పంచ్ అక్కెం హజరత్‌రెడ్డి, మధురెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్ వలి ఆకస్మిక తనిఖీలు చేశారు. బుధవారం మండల పరిధిలోని కొండాయపాలెం, వెంకట్రావుపల్లి హరిజనవాడ ఎంపిపిఎస్ ప్రాథమిక పాఠశాలను తనిఖీలు చేసి విద్యార్థుల నైపుణ్యాలు సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల వర్క్ బుక్‌లను పూర్తి చేసే విధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నాణ్యతతో కూడిన గుణాత్మక బోధన చేయాలని తరగతి గదులు పాఠశాల చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉండేవిధంగా ప్రధానోపాధ్యాయులు ఆయాకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల, మధ్యాహ్న భోజన నిర్వాహకుల, ఆయాల హాజరు పట్టీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఫార్మేటివ్ అసెస్మెంట్ 3 మార్కులను సిసిఇ రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు షేక్ హుస్సేన్ బాషా, పి.సాబీరా పాల్గొన్నారు.

సిపిఐ పోరుబాట జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి ఇందుకూరుపేట



సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే సిపిఐ పోరుబాట మహా ధర్నా కార్యక్రమాన్ని జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు హాజరై జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర రైతు విభాగం నాయకులు ఎస్.కె.షాన్‌వాజ్ పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని ఇందుకూరు పేటలో సిపిఐ పోరుబాట వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోగా ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. ప్రజలందరికీ సమానంగా ఇళ్లు కట్టించి ఇస్తానన్న జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను మర్చిపోయారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని జగనన్న ఇళ్లకు ఐదు లక్షల ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణ స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులందరూ సిపిఐ మహా ధర్నాకు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నెల్లూరు జిల్లా కన్వీనర్ షేక్ మున్నా, ఎన్.మధు, నెల్లూరు రమణయ్య, వీరయ్య, ఎస్ డి గౌస్ బాషా, కొముదుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లిలో పొలంబడి

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని అయ్యవారిపల్లి రైతు భరోసా కేంద్రలో జరుగుతున్న డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం డిఆర్‌సి ఎడిఎ లక్ష్మీ మాధవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ దేవి పరిశీలించారు. పొలంబడి రైతులకు సలహాలు సూచనలిచ్చారు. ఇంటర్నేషనల్ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా రైతులందరూ చిరుధాన్యాలను పండించాలని వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. అలాగే ప్రతిపంటను పరిశీలించి రసం పీల్చే పురుగుల నివారణకు డై ఫెంతురాన్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. పత్తిలో మెగ్నీషియం లోపం ఉన్నట్లయితే మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు, 90 రోజుల లోపు పత్తి పంటకు తయోమెథాక్షమ్, ఇమిడాక్లోప్రిడ్ మందులు వాడరాదని సూచించారు. అలాగే మిరపలో కాయకుల్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటికి, స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము పది లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఎఇఒ నారాయణ, విఎఎలు నరేంద్ర, లక్ష్మీనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సచివాయంలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-సీతారామపురం

సీతారామపురం బిట్-2 సచివాలయంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ బుధవారం తనిఖీ చేశారు. పేదల వైద్యానికి ఉపకరించే ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పెన్షన్ పంపిణీ వివరాలను అడిగి తెలుసుకుని నూరు శాతం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించిన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలిసి సీతారామ పురం ఎస్సి కాలనీలో ఉపాధి హామీ పనులకు జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం హాజరవ్వాలన్నారు.

80శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 1వతేదీ బుధవారం 80 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు తెలిపారు. మొత్తం 3407 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా తొలిరోజే 2900 పైగా లబ్ధిదారులకు పింఛన్లు వాలంటీర్లు ద్వారా ఉదయాన్నే పంపిణీ చేసినట్లు తెలిపారు. పెంచల పంపిణీలో వాలంటీర్లు కౌన్సిలర్లు సచివాలయ కన్వీనర్లు గృహసారథులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరికి ఓటు వేయాలని బుధవారం 14, 15వ వార్డుల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పులిమి శైలజ రెడ్డి, తుమ్మల చంద్రా రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, పయ్యావుల మారుతి నాయుడు, వెంకటయ్య, పెంచలయ్య, ప్రవీణ్, మంగమ్మ, తోడేటి పెంచలయ్య, శేషారెడ్డి, ఖాజామస్తన్, రమణయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సుధాకర్, మల్లిక సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలలో టిడిపి తరపున ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్ విజయం కోసం మండల టిడిపి అధ్యక్షులు అరికట్ల జనార్ధన్ నాయుడు మండలంలో బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యలగాల వెంకటేశ్వర్లు, కర్రావుల శ్రీనివాసులు, మాడుపూరు చంద్రబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు మద్దతుగా బుధవారం మండల టిడిపి కన్వీనర్ చంద్రా మధుసూదన్ అధ్యక్షతన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ముజే లక్ష్మీనారాయణ, లబాను, అరోను, వెంకటరత్నం, సుకుమార్, మాధవ, కోన్ల, నగేష్, కొండల్ రావు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని రైతులు నిరసన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మండలం నాగులపాడు గ్రామ రైతులు తమ గ్రామం గుండా వెళ్లే కాలువ పై బ్రిడ్జి నిర్మించాలని కాలువలో నడుము లోతులో నిలబడి నిరసనలు తెలిపారు. తమ గ్రామం గుండా ప్రవహిస్తున్న కాలువపై బ్రిడ్జి లేనందువల్ల తమ పంట ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందారు. కాలువలో పూడిక నిండిపోవడంతో రైతులు సొంత నిధులతో జెసిబిని ఏర్పాటు చేసి పూడిక తీయించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ తమ గ్రామం నుండి ప్రవహిస్తున్న కాలువపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వెంగళరావు నగర్లో ఉన్న సంయుక్త సేవా కార్యాలయంలో సంస్థ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ నేర్చుకున్న 5 మంది పేద మహిళలకు స్వయం జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ గౌరవ సభ్యులు ఎం.అజిత్ బాబు, గంధం ప్రసన్నాంజనేయులు, ఎమ్ వి ఎన్ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంధం ప్రసన్నాంజనేయులు, అజిత్ బాబు మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థకు కుట్టుమిషన్లు అందజేసిన సంస్థ సభ్యులకు సురేంద్ర ధన్యవాదాలు తెలిపారు.